సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

అరకు పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకుడు ప్రమోద్ మెహర్దా, శాంతి భద్రతల పరిశీలకుడు నయీం ముస్తఫా మన్సూరి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. - IIలో



జీసీసీ లక్ష్యాలను అధిగమించాలి

నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జీసీసీ డీఎం మహేంద్రకుమార్ సిబ్బందిని ఆదేశించారు. - IIలో

పాలెంలో గజరాజుల సంచారం

కొమరాడ: కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోని పలు గ్రామల్లో కొన్నేళ్లుగా సంచరిస్తున్న గజరాజుల గుంపు బుధవారం రాత్రి కొమరాడ మండలంలోని పాలెం గ్రామ పంట పొలాల్లో సంచరించింది. దీంతో గ్రామల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పాలెం గ్రామ రైతులు రాత్రివేళ పంటపొలాల్లోకి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల పరిశీలకులతో భేటీ

- స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీలు



సాధారణ పరిశీలకుడు ప్రమోద్ మెహర్దాకు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ నియమించిన సాధారణ పరిశీలకుడు ప్రమోద్ మెహర్దా, శాంతి భద్రతల పరిశీలకుడు నయీమ్ ముస్తఫా మన్సూరిలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం స్థానిక పోలీస్ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు ఎన్నికల పరిశీలకులకు సాదరంగా స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛగా ప్రశాంతంగా నిర్వహించేందుకు అమలు చేస్తున్న ప్రణాళికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులవద్ద తనిఖీలు, పటిష్ట నిఘా తదితర అంశాలపై కలెక్టర్, ఎస్పీలు ఎన్నికల పరిశీలకుడికి వివరించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. కచ్చితమైన ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుతో పాటు, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అనుసరించాల్సిన విధానంపై చర్చించారు.

మలేరియా నివారణకు సమష్టి కృషి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: మలేరియా నివారణకు అందరి సమన్వయంతో సమష్టి కృషి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖా కార్యాలయం ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నియంత్రణకు దోమల వ్యాప్తిని అరికట్టడం ప్రధానమని, అందుకుగాను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, తద్వారా దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయని చెప్పారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేపట్టి జ్వర లక్షణాలున్న వారిని గుర్తిస్తున్నామని, జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో మలేరియా నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏఎంఓ సూర్యనారాయణ, కన్సల్టెంట్ రామచంద్రుడు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ నగేష్ రెడ్డి, డెమోలు యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారంలో వీఓఏ



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వీఓఏ లీలాకుమారి (వృత్తంలో)

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గరుగుబిల్లి మండలంలోని చినగుడబ గ్రామంలో ఈనెల 23న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ వెలుగు కార్యాలయం వీఓఏ నెల్లి లీలాకుమారి ఉద్యోగినని మరిచిపోయి అత్యుత్సాహంతో పాల్గొన్నారు.

రారవే రచయితకు పురస్కారం

రాజాం సిటీ: రాజాం రచయితల వేదిక (రారవే) నిర్వాహకుడు, రచయిత గార రంగనాథం రచించిన 'రాయరత్న మంజూష' అనే పుస్తకానికి చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కారం వరించింది. ఇటీవల వరంగల్‌కు చెందిన శ్రీలేఖ సాహితీ సంస్థ నిర్వహించిన పోటీలో పుస్తకానికి పురస్కారం లభించిందని ఆయన గురువారం తెలిపారు. మే 12న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు హైదరాబాద్‌లో అందజేస్తారని పేర్కొన్నారు.

ఎవరిల్లు..వారిదే..!



పార్వతీపురం కృష్ణపల్లి జగనన్న లేఔట్

- ఇళ్ల స్థలాలపై పేదలకు సర్వహక్కులు
- జగనన్న కాలనీల్లోని స్థలాలకు రిజిస్ట్రేషన్లు
- మన్యం జిల్లాలో 27,142 మందికి లబ్ధి

పార్వతీపురంటౌన్:

పేదల సొంతింటికల నెరవేర్చడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'నవరత్నాలు'లో భాగంగా అందరికీ ఇళ్ల పథకాన్ని అమలు చేశారు. అందులో భాగంగా రూరల్ ప్రాంతంలో లబ్ధిదారులకు స్థలం ఇవ్వడమే కాకుండా ఇంటి నిర్మాణానికి ప్రోత్సహించారు. జగనన్న కాలనీల పేరిట ఏకంగా ఊళ్లను నిర్మించిన ప్రభుత్వం కాలనీల్లో అన్ని వసతులూ సమకూర్చింది. అంతటితో ఆగకుండా ఆ స్థలాలపై పేదలకు పూర్తి హక్కులు కల్పించింది. జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి, పత్రాలను లబ్ధిదారులకు అందజేసి సర్వహక్కులు కల్పించింది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిచేశారు. రిజిస్ట్రేషన్లకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ప్రభుత్వం నిర్ణయంతో జిల్లాలో ఇంటి స్థలం వచ్చిన పేదలకు ఎంతో మేలు చేకూరింది.



27,142 మందికి లబ్ధి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో ప్రభుత్వం పార్వతీపురం మన్యం జిల్లాలో 27,142 మందికి స్థలాలు మంజూరు చేసింది. ఆ స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి రూ.1.80 లక్షల చొప్పున సాయం అందించింది. డ్వాక్రా మహిళలకు మరో రూ.35 వేల రుణం మంజూరు చేసింది. రాయితీపై సిమెంట్, ఐరన్‌తో పాటు ఇసుకను ఉచితంగా అందించింది. జగనన్న కాలనీల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ సదుపాయం ఇతర వసతులు కల్పిస్తోంది. కాలనీల్లో నిర్మించిన ఒక్కో ఇంటి విలువ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉంటుంది.

పూర్తయిన రిజిస్ట్రేషన్‌లు



పార్వతీపురం పట్టణంలోని జగన్నాథపురం-2 సచివాలయంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను జనవరిలో ప్రారంభించి ఫిబ్రవరి 9నాటికి పూర్తి చేశారు. రిజిస్ట్రేషన్లు సమర్థవంతంగా పూర్తి చేసేందుకు వీఆర్‌ఓలు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని 350 గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజి స్ట్రేషన్ల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం తరఫున వీఆర్‌ఓ లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. సచివాలయ కార్యదర్శులు జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లబ్ధిదారుని ప్లాట్ నంబర్, సరిహద్దుల వివరాలను రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు.

టీడీపీ హయాంలో డీపట్టాలు మాత్రమే..

టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇళ్ల లబ్ధిదారులకు డి-పట్టాలు మాత్రమే ఇచ్చేవారు. గృహ నిర్మాణ రుణం కోసం ఆ పట్టాలను హౌసింగ్ కార్పొరేషన్ తనఖా పెట్టుకునేది. లబ్ధిదారులకు ఎలాంటి హక్కులూ ఉండేవి కావు. అప్పులు పుట్టక ఇబ్బందికర పరిస్థితులు ఉండేవి.

ఇంటి స్థలంపై హక్కు



ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా సర్వహక్కులు కల్పించారు. అన్ని అర్హతలు కలిగి ఉండి గతంలో ఇంటి స్థలంకోసం ఎన్నిసార్లు అర్జీ పెట్టుకున్నా జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించలేదని ఇంటి స్థలం మంజూరు కానివ్వలేదు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో లంచాలకు తావు లేకుండా ఇంటి స్థలాన్ని మంజూరు చేసి, నిర్మాణానికి ఆర్థిక సాయం చేసి స్థలం రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కులు కల్పించారు.

–ఎస్.సౌజన్య, లబ్ధిదారు, పార్వతీపురం పట్టణం

ఎన్నోసార్లు అర్జీ పెట్టుకున్నా దక్కని ఫలితం



గతంలో ఇంటి స్థలం కావాలని ఎన్నోసార్లు అర్జీ పెట్టుకున్నా ఫలితం దక్కలేదు. అప్పట్లో జన్మభూమి కమిటీల వారు లంచాలు అడిగేవారు. జగనన్న ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత పరిస్థితి పూర్తిగా మారింది. వలంటీర్లు లబ్ధిదారులను గుర్తించి ఇంటిస్థలాలు ఇచ్చారు. ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా నేడు రూ.10లక్షల ఆస్తి సంపాదించాను. నాకు ఇచ్చిన స్థలానికి రిజిస్ట్రేషన్ చేశారు. చాలా ఆనందంగా ఉంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–సంధ్య, లబ్ధిదారు, పార్వతీపురం

గతంలో ఎన్నడూ ఇలా లేదు



గతంలో కేవలం అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ ప్రతినిధులు చెప్పిన వారికి మాత్రమే ఇళ్ల స్థలాలు అందజేశారు. కానీ జగనన్న ప్రభుత్వంలో మా వలంటీర్ నా వివరాలు అడిగి అర్జీ పెట్టారు. నాకు ఇంటి స్థలం మంజూరు చేసి ఎమ్మెల్యే చేతుల మీద పట్టా అందజేశారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంట్, ఐరన్ అందించి కొంత ఆర్థిక సాయం చేశారు. ఇప్పుడు ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలు అందజేశారు.

–అలేఖ్య, లబ్ధిదారు, కొత్తవలస, పార్వతీపురం

పెళ్లింట విషాదం

దగ్గర బంధువు వివాహానికి అందరూ సంతోషంగా హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లి క్రతువు పూర్తికావడంతో మధ్యాహ్నం భోజనాలు చేసి స్వగ్రామాలకు బయలుదేరారు. అంతే.. ఐదు నిమిషాల వ్యవధిలో వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ ట్రాలీ ఓ మలుపు వద్ద బోల్తా కొట్టింది. ప్రమాదంలో వధువు నాయనమ్మ మృతిచెందగా, మరో 15 మంది గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

- ట్రాక్టర్ ట్రాలీ బోల్తా.. ఒకరి మృతి
- 15 మందికి గాయాలు
- పటువర్ధనం వద్ద ఘటన
- సహాయక చర్యలు అందించిన పటువర్ధనం, బాగెంపేట వాసులు



ఘటనా స్థలంలో మృతిచెందిన సత్తెమ్మ



రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వంగర: పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన ఓ యువతిని వంగర మండలంలోని పటువర్ధనం గ్రామానికి చెందిన యువకుడితో ఈ నెల 24న రాత్రి వివాహం జరిగింది. శుభకార్యంలో భాగంగా వివాహం మరుసటి రోజు గురువారం భోజనాలు పెట్టారు. దీనికోసం బంధువులందరూ ట్రాక్టర్‌పై వచ్చారు. వధూవరులను ఆశీర్వదించిన తర్వాత భోజనాలు చేసి తిరుగు ప్రయాణం అయ్యారు. గ్రామం దాటిన ఐదు నిమిషాల్లోనే పటువర్ధనం-బాగెంపేట గ్రామాల మధ్య మలుపు వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. అంతే.. ఆ ప్రాంతమంతా హాహాకారాలు మిన్నంటాయి. ట్రాలీలో కూర్చుని ప్రయాణిస్తున్నవారంతా చెల్లాచెదురుగా పడిపోయారు. ట్రాలీ కింద ఉండిపోయిన వధువు నాయనమ్మ సత్తెమ్మ(50) ఘటనా స్థలంలోనే మృతిచెందింది. మరో 15 మందికి తీవ్రగాయాలు కాగా వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు బంధువులు చెబుతున్నారు. గాయపడిన వారిలో పడాల లక్ష్మి, యాకల నీలమ్మ, నండ నారాయణ, యాకల సన్యాసిరావు, పడాల సత్యం, ముగడ పైడమ్మ, నాగళ్ల పారమ్మ, నక్కాను గీత తదితరులు ఉన్నారు. వారందరినీ 108 సహాయంతో రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుల వివరాలు సేకరించారు. ఎస్సై వై.వి.జనార్దన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రులంతా పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలంలోని పెదపెంకి, చినగలావిల్లి, వెంగాపురం, తెర్లాం మండలం నందబలగ, కాలరాజపురం, సంతకవిటి మండలం గుళ్లసీతారాంపురం గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. ఘటనా స్థలానికి పెద్ద ఎత్తున పటువర్ధనం, బాగెంపేట గ్రామాలకు చెందిన ప్రజలు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వధువు తండ్రి సత్యం కూడా అదే ట్రాక్టర్‌లో ప్రయాణానికి సిద్ధమయ్యాడు. కొద్దిదూరం వెళ్లాక ఇంటి తాళంకోసం ట్రాక్టర్ దిగి ఊరిలోకి రావడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వై.వి.జనార్దన్

దారిద్ర్యం వదిలింది

- భీంపురం సమీపంలో పూర్తయిన బ్రిడ్జి
- నెరవేరిన వంతెన కల
- గిరిజనులకు దూరమైన ప్రయాణ కష్టాలు
- 180 గ్రామాలకు అందనున్న విద్య, వైద్యం, వ్యాపారసేవలు

కురుపాం:

పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో సుమారు 180 గిరిజన గ్రామాలకు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో రహదారి ఇబ్బంది తీరింది. దశాబ్దాల నాటి గిరిజనుల వంతెన కల సాకారమైంది. గతంలో రహదారి సదుపాయం లేక సరైన వైద్యసేవలు అందక మృత్యువాత పడుతున్నామని, ప్రభుత్వ విద్యాబోధన అందడం లేదని, పండించే పంటలను విక్రయించుకోలేని పరిస్థితి నెలకొందని ఎన్నికల సమయంలో తమ వద్దకు ఓట్ల వచ్చే ప్రజాప్రతినిధులు, గ్రీవెన్స్ సెల్‌లో అధికారులకు గిరిజన ప్రజలు విన్నవించుకునే వారు. అయినా ఏ నాయకుడు, అధికారి పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ పరిస్థితుల్లో అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గడపగడపకు వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించిన సమయంలో కురుపాం మండలంలోని ఒబ్బంగి పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఆ క్రమంలో భీంపురం వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలని గిరిజనులంతా కోరారు. దీనికి స్పందించిన ఆమె తమ పార్టీ అధికారంలోకి వస్తే వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వంతెన నిర్మాణానికి రూ.80 లక్షలు నిధులు మంజూరు చేయించి పనులు త్వరితగతిన జరిగేలా ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులను కోరారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం వంతెన నిర్మాణం పూర్తి కావడంతో గిరిజనం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



భీంపురం వద్ద గతంలో ఉన్న లోయ ప్రదేశం (ఇన్‌సెట్లో) వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన వంతెన

ఇకపై మెరుగైన సేవలు

గతంలో వంతెన సౌకర్యం లేకపోవడంతో వర్షాలు పడితే వందల సంఖ్యలో గిరిజన గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. అలాగే అత్యవసర సమయంలో రహదారి సక్రమంగా లేక వైద్యసేవలు అందక మృత్యువాత పడేవారు. మరోదారిలేక డోలీ కట్టి రోగులను వైద్యసేవల కోసం తరలించేవారు.

ప్రస్తుతం వంతెన నిర్మాణం పూర్తి కావడంతో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని భీంపురం, నీలకంఠాపురం, వాడకొయ్యి, సుక్కుగూడ, జరడ, గాణలి, తిత్తిరి, ఒబ్బంగి, ధర్మలక్ష్మీపురం, పొక్కిరి, దండుసూర తదితర గ్రామాలతోపా టు సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గురండి, ఈతమానుగూడ, సరాబువలస, పుట్టిగాడిగూ డ, కోమటిగూడ, సీడుమానుగూడ, బంజరుగూడ, నెల్లిగూడ, సావిసివలస, చినబగ్గ తదితర వందల సంఖ్యలో గిరిజన గూడల ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయి. ఇకపై గిరిజనం పండించే పంటలను అటు సీతంపేట ఐటీడీఏ పరిధిలోని వారపు సంతల కు, ఇటు పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని వారపు సంతలకు తీసుకు వెళ్లి విక్రయించుకునే అవకాశం కలిగింది. అలాగే మెరుగైన విద్య, వైద్య సేవలను సకాలంలో పొందగలమంటూ గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తీరిన డోలీ కష్టాలు



గత టీడీపీ ప్రభుత్వం హయాంలో గిరిజనాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి గిరిజన గ్రామానికి రహదారి, విద్య, వైద్యం అందేలా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా భీంపురం వంతెన లేకపోవడంతో అత్యవసర సమయాల్లో వైద్యసేవల కోసం డోలీ మోతలు తప్పేవి కాదు. ఎమ్మెల్యే చొరవతో వంతెన పూర్తయింది. గిరిజన ప్రజలకు డోలీ కష్టాలు తీరాయి.

–ఇంటికుప్పల గౌరీశంకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, కురుపాం

దశాబ్దాల కల నెరవేరింది



భీంపురంపై వంతెన నిర్మాణం గిరిజనుల దశాబ్దాల కల. గత ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాల్లేవు దీంతో వందలసంఖ్యలో గిరిజన గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడేవారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి వంతెన నిర్మాణం పూర్తి చేశారు. ఇక నుంచి మెరుగైన సేవలు అందుతాయి.

–బిడ్డిక అన్నాజీరావు, గిరిజన సంఘం నాయకుడు, దండుసూర గ్రామం

పూర్తయిన నామినేషన్ల ప్రక్రియ

- పార్లమెంట్‌కు 37 సెట్లు
- అసెంబ్లీకి 66 సెట్ల నామినేషన్లు దాఖలు
- నేడు పరిశీలన
- ఉపసంహరణకు 29వ తేదీ వరకు అవకాశం



సాక్షి, పార్వతీపురం మన్యం: సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు జరిగిన ఈ ప్రక్రియలో అరకు పార్లమెంట్ స్థానంతో పాటు..పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, సాలూరు, కురుపాం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ముహూర్తం బాగుండడంతో ఎక్కువ మంది ఈ నెల 19, 22, 24, 25వ తేదీల్లో వారి నామినేషన్లను ఆయా రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ సందర్భంగా పోటాపోటీగా ర్యాలీలు చేపట్టారు.

అత్యధికంగా కురుపాంలో..

మొత్తంగా అరకు పార్లమెంట్ స్థానానికి 24 మంది 37 సెట్లను, నాలుగు అసెంబ్లీ స్థానాలకు 45 మంది 66 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వాటిలో పాలకొండ నియోజకవర్గానికి 12, కురుపాం 19, సాలూరు 17, పార్వతీపురం 18 ఉన్నాయి. రిటర్నింగ్ అధికారులకు సమర్పించిన నామినేషన్లను ఆయా పార్లమెంట్ నియోజకవర్గం, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ నెల 26న పరిశీలిస్తారు. వాటిలో ఏమైనా లోపాలుంటే తిరస్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ వరకు గడువు ఉంది. అభ్యర్థులకు డమ్మీగా నామినేషన్లను ఎవరైనా వేసినా ఆ తేదీలోగా ఉపసంహరించుకోవాల్సి ఉంటుంది. అదే రోజున ఎన్నికల బరిలో ఎంతమంది ఉండనున్నారో లెక్క తేలనుంది. రాజకీయ పార్టీల తరఫున బీఫాం అందజేసిన అభ్యర్థులకు ఆయా పార్టీల తరఫున గుర్తులు కేటాయిస్తారు. మిగిలిన అభ్యర్థులను స్వతంత్రులుగా పరిగణించి ఈసీ మార్గదర్శకాలను అనుసరించి గుర్తులు కేటాయిస్తారు.

క్లుప్తంగా

జేఈఈ ఫలితాల్లో ప్రతిభ


రేవంత్‌సాయి


అభిరామ్

సీతానగరం: ప్రభుత్వం గురువారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ పరీక్షల ఫలితాల్లో సీతానగరం మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండలంలోని వెంకటాపురం పంచాయతీ నీలకంఠాపురంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.కూర్మినాయుడి కుమారుడు పువ్వల రేవంత్ సాయి ఆలిండియా స్థాయిలో 2070. ఓబీసీలో 370వ ర్యాంక్ సాధించాడు. అలాగే గుచ్చిమి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు చెల్లారపు శ్రీనివాసరావు కుమారుడు అభిరామ్ ఆలిండియాలో 1552వ ర్యాంక్, ఓబీసీలో 267వ ర్యాంక్ సాధించాడు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు విద్యార్థులకు పలువురు అభినందనలు తెలియజేశారు.

28, 30 తేదీల్లో క్రికెట్ జట్ల ఎంపిక

విజయనగరం రూరల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న (ఆదివారం) సీనియర్స్ విభాగంలో పురుషుల క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎస్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వారి ఒరిజినల్ ఆధార్, జన్మదిన ధ్రువపత్రాలు తీసుకొని హాజరు కావాలన్నారు.

30న అండర్ -19 ఎంపిక పోటీలు

ఈ నెల 30న అండర్ -19 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎంఎల్ఎస్ రాజు తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2005 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువపత్రం, గత మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలన్నారు. సంబంధిత తేదీల్లో ఉదయం 6.30గంటలకు వైట్ డ్రెస్, సొంత కిట్‌తో హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్యేపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన మహిళపై ఫిర్యాదు

దత్తిరాజేరు: బొండపల్లిలో ఈ నెల 23న టీడీపీ నిర్వహించిన మహిళా గళం సదస్సులో స్థానిక ఎమ్మెల్యేపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన మేడిశెట్టి సుబ్బలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని పెదమానాపురం పోలీస్‌స్టేషన్‌లో బోజరాజపురానికి చెందిన ఎస్.చెల్లయ్య, ఎస్.భూర్జవలస పోలీస్ స్టేషన్‌లో ఎస్.చింతలవలస గ్రామానికి చెందిన వి.లక్ష్మణరావు గురువారం ఫిర్యాదు చేశారు. ఆ సదస్సులో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యపై నిరాధారమైన తప్పుడు వ్యాఖ్యలు చేసిన ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుల్లో వారు కోరారు. ఎమ్మెల్యే ఆమె కుటుంబాన్ని వేధిస్తున్నారని, భూములు లాక్కొనేందుకు ప్రయత్నిస్తున్నారని చేసిన ఆరోపణలు నిరాధారమైనవని వారు పేర్కొన్నారు.

ఆలయ అర్చకుడు సస్పెన్షన్

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు రంపా సూర్యనారాయణశర్మను సస్పెండ్ చేశామని ఈఓ బీవీ మాధవరావు గురువారం తెలిపారు. ఆలయంలో అతని వద్దకు విద్యనభ్యసించడానికి వచ్చిన సహాయకుడైన భరద్వాజ్‌ని విచక్షణారహితంగా కొట్టడంపై వచ్చిన ఫిర్యాదులు మేరకు వారం రోజుల పాటు సస్పెండ్ చేశామని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నామని తెలిపారు.

సచివాలయ ఉద్యోగి అనుమానాస్పద మృతి


మృతి చెందిన వెటర్నరి అసిస్టెంట్ నాగరాజు

జామి: మండలంలోని అట్టాడ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కిర్ల గ్రామానికి చెందిన దండి నాగరాజు(34) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నాగరాజు తన భార్య గౌరీతో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద నివాసం ఉంటున్నాడు. నాగరాజు తన భార్యను తిమిడి గ్రామానికి ఈ నెల 23న బంధువుల వివాహం కోసం పంపించాడు. తరువాత తన స్వగ్రామం కిర్ల గ్రామానికి వచ్చాడు. వచ్చిన నుంచి నాగరాజు విచారంగా ఉండేవాడు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు బైక్, ఫోన్, చెప్పులు ఇంటి వద్దే వదిలేసి బయటకు వెళ్లాడు. తరువాత తిరిగి రాలేదు. దీంతో నాగరాజు తండ్రి తన కుమారుడు కనబడలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం అలమండ హైవే వద్ద నాగరాజు మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని నాగరాజుగా గుర్తించారు. తండ్రి సన్యాసి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹133	₹236	₹246


పాలకొండ రూరల్: వాటపాగులో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్


సీతానగరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావుకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే ఎస్ జయమణి


ఎన్నికల ప్రచారానికి వచ్చిన సాలూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొరకు హారతి ఇస్తున్న మహిళ


గుమ్మలక్ష్మీపురం: ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని వత్తాడలో గిరిజనులను కోరుతున్న కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి

హోరెత్తిన ఎన్నికల ప్రచారం

ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో గురువారం జరిగిన ఎన్నికల ప్రచార దృశ్యాలు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి


రాజశేఖర్‌కు కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఈ మేరకు వీరఘట్టం మండలంలోని విక్రమపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మాచర్ల రాజశేఖర్ గురువారం ఎమ్మెల్సీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన 2021 పంచాయతీ ఎన్నికల్లో విక్రమపురంలో టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితుడినై అధికార పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాచర్ల వెంకటరమణ, శ్రీరాములు దొర, మాచర్ల జగన్, కళింగ ప్రేమభూషణరావు, పాలవలస ధవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు కృషి చేయాలి

- జిల్లా మలేరియా అధికారిణి మణి


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: మలేరియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారిణి వై.మణి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక అంబటి సత్రం జంక్షన్ వద్ద నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారానికి ఒకసారి డ్రైడే పాటించడం ద్వారా దోమల పుట్టుకని అరికట్టవచ్చునని తెలిపారు. ఆడ అనాఫిలిస్ దోమలు కుట్టడం వల్ల ప్లాస్మోడియం అనే పరాన్న జీవులు మనిషి రక్తంలోకి ప్రవేశించడం ద్వారా మలేరియా వ్యాధి సోకుతుందని చెప్పారు. చిన్న పిల్లలు ఎక్కువగా మలేరియా బారిన పడుతుంటారని, సకాలంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకమని చెప్పారు. దోమ తెరలు వాడటం మంచిదన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇస్మాయిల్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ శిరీష, సబ్ యూనిట్ అర్బన్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్వర పీడితులకు మలేరియా పరీక్ష

విజయనగరం ఫోర్ట్: జ్వరం వచ్చిన వ్యక్తులకు రక్త నమూనా తీసి మలేరియా నిర్ధారణ పరీక్ష చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా వ్యాధి వ్యక్తిగత ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. దోమల నివారణకు పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ అధికారులు ఆరోగ్య శాఖకు సహకరించాలని కోరారు. పొదుపు సంఘాల మహిళలకు దోమల నివారణ పద్ధతులు గురించి వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా టీకా అధికారి డాక్టర్ ఆర్.అచ్యుతకుమారి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సాంబశివరావు, డెమో చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

జగన్ కోసం చిన్నారుల అభిషేకం

రాజాం : పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన బి.సతీష్‌బాబు, జి.గణేష్, బి.శివ, కె.గణపతిలతో పాటు చిన్నారులు డోలపేటలో అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం పూజలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని 111 కొబ్బరికాయలు కొట్టి ఆంజనేయస్వామికి అభిషేకం చేశారు. మళ్లీ సీఎంగా జగనన్నే రావాలని కోరుతూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఎగైన్ జగన్ అంటూ ప్లకార్డులు ఆలయం వద్ద ప్రదర్శించారు. తమ లాంటి ఎన్నో లక్షల కుటుంబాలు బాగుండాలంటే జగనే సీఎం కావాలని వారంతా ఆకాంక్షించారు.


డోలపేట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద 111 కొబ్బరికాయలతో అభిషేకం చేస్తున్న అభిమానులు

మే 21న పైడితల్లి దేవర మహోత్సవం

- కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ ప్రసాదరావు


దేవర మహోత్సవ విశేషాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ ప్రసాదరావు, తదితరులు

విజయనగరం టౌన్:

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు దేవర మహోత్సవం మే 21న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు పేర్కొన్నారు. స్థానిక అన్నదాన భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఉత్సవ విశేషాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా వైశాఖ మాసంలో అమ్మవారి దేవర మహోత్సవం నిర్వహిస్తామన్నారు. మే 20న సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి వనంగుడి వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహానికి స్నపన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం అమ్మవారిని అలంకరణ చేసి, ఆలయం చుట్టూ మూడుసార్లు పూజారి ఉత్సవ విగ్రహంతో ప్రదక్షణలు చేస్తారన్నారు. అక్కడ నుంచి అమ్మవారిని ఉత్సవ రథంపై ఆసీనులు చేసి వనంగుడి నుంచి సున్నంబట్టీ వీధి, గాడీఖానా, ఎన్‌సీఎస్‌రోడ్డు, కన్యకపరమేశ్వరీ ఆలయం, న్యూపూర్ణ కూడలి, పార్కు గేటు మీదుగా హుకుంపేటలో ఉన్న పూజారి ఇంటి వద్ద ఉన్న చదురువద్దకు రాత్రి 7 గంటల ప్రాంతంలో తీసుకువెళ్తారు. అక్కడ రెండు తల్లి ఘటాలు, ఆరు పిల్ల ఘటాలకు భక్తులు పసుపు, కుంకుమలను సమర్పించి పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ఉపారాలు పెడతారన్నారు. అనంతరం శివాలయం వీధి మీదుగా అర్ధరాత్రి దాటిన తర్వాత చదురుగుడికి చేరుతారని తెలిపారు. వేకువజామున 3.30 గంటల ప్రాంతంలో పెద్దచెరువు పశ్చిమ భాగాన చెరువులో దిగి సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తలయారులు, జముకులు అమ్మవారికి మనవి చెప్పి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం పెద్దచెరువులో మట్టి సేకరించి చదురుగుడికి మే 21న మంగళవారం ఉదయం 6.30 గంటలకు చేరుకుంటారన్నారు. నాటి నుంచి అమ్మవారు ఉయ్యాలకంబాల మహోత్సవం వరకూ చదురుగుడిలో అమ్మవారు కొలువై ఉంటారన్నారు. సమావేశంలో ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, శ్రీనివాసరాజు, సీనియర్ అసిస్టెంట్ మణికంఠ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన


కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్వహణపై వివరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో జరుగుతున్న ఏర్పాట్లను అరకు పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకుడు ప్రమోద్ మెహర్దా, శాంతి భద్రతల పరిశీలకుడు నయీం ముస్తఫా మన్సూరి గురువారం పరిశీలించారు. వారిద్దరూ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎన్నికల ప్రవర్తన నియమావళి విభాగం, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్, మీడియా సెంటర్, సోషల్ మీడియా విభాగం, వ్యయ విభాగం, ఫిర్యాదుల విభాగం, చెక్ పోస్టుల పర్యవేక్షణ తదితర విభాగాల పనితీరును క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అనంతరం ఉద్యాన కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ జిల్లాలో చేపడుతున్న చర్యలను, కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరును వారికి వివరించారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటుచేస్తున్న సౌకర్యాలు, తదితర విషయాలను తెలియజేశారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్.శోభిక, డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, ఎంసీసీ నోడల్ అధికారి గయాజుద్దీన్, సోషల్ మీడియా నోడల్ అధికారి సాయికుమార్, ఎంసీఎంసీ నోడల్ అధికారి ఎల్.రమేష్, వ్యయవిభాగం నోడల్ అధికారి శ్రీరామమూర్తి, సహాయ వ్యయ పరిశీలకుడు ఆర్‌వీ.రమణమూర్తి తదితరులున్నారు.

స్ట్రాంగ్‌రూంల పరిశీలన

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ప్రమోద్‌కుమార్ మెహెర్దా, పోలీస్ అబ్జర్వర్ నయీమ్ ముస్తఫా మన్సూరి, కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్, ఆర్డీఓ, పార్వతీపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి హేమలత గురువారం పరిశీలించారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రతకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూంలలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఆరాతీశారు. పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

విజయనగరం టౌన్: స్థానిక కలెక్టరేట్ సమీపంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమారు 70 నుంచి 75 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు గురువారం తెలిపారు. డయల్ 100కి వచ్చిన కాల్ ఆధారంగా అతని గురించి విచారణ చేశామని, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వన్‌టౌన్ ఎస్ఐ నరేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వృద్ధుడి వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

సీతానగరం: మండలంలోని తామరఖండి గ్రామంలో గ్రామస్తుల ఆర్థిక సహకారంతో నిర్మించిన ఆలయంలో లక్ష్మీనృసింహస్వామి, ఉమామహేశ్వర స్వామి, నవగ్రహ పరివార దేవత విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ అర్చకులు టి.కృష్ణారావుశాస్త్రి, బ్రహ్మశ్రీ యర్ల రాంబాబుశాస్త్రి ఆధ్వర్యంలో గురువారం దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జాతీయ స్థాయిలో ఎనిమిదవ ర్యాంక్


చింటు సతీష్

పాలకొండ రూరల్: పాలకొండ నగరపంచాయతీకి చెందిన చింటు సతీష్ జేఈఈ మెయిన్స్‌లో శతశాతం మార్కులు దక్కించుకుని జాతీయ స్థాయిలో 8వ ర్యాంక్ సాధించాడు. ఓబీసీ విభాగంలో 2వ ర్యాంకు దక్కించుకున్నాడు. గురువారం విడుదలైన ఫలితాల్లో తమ కుమారుడు ఈ విజయం సాధించినట్లు తల్లితండ్రులు బుచ్చన్న, రమాదేవి తెలిపారు. వారిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తమ కుమారుడు ఆరవ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు విశాఖలో విద్యాభ్యాసం చేసినట్లు చెప్పారు.

రూ.4.43 కోట్ల విలువైన నగదు, మద్యం, వస్తువుల సీజ్

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి


మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన దగ్గర నుంచి ఇప్పటి వరకు జిల్లాలో సుమారు రూ.4.43 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహ పరికరాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసిన అనంతరం గురువారం ఆమె కలెక్టరేట్ మీడియా సెంటర్‌లో మాట్లాడారు. సీజ్ చేసిన వాటిలో నగదు రూ.1.04 కోట్లు, 14,372 లీటర్ల మద్యం, రూ.29.75 లక్షల విలువైన డ్రగ్స్, రూ.1.85 కోట్ల విలువైన లోహ ఆభరణాలు, రూ.75.13 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు అధికారులతో జిల్లా గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు సమావేశమై, సీజ్ చేసిన వాటిపై చర్చిస్తుందని తెలిపారు. వీటిలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించినవైతే సీజ్ చేసి, కేసు నమోదు చేస్తామని చెప్పారు. సాధారణ ప్రజలకు చెందినవైతే వాటి ఆధారాలను పరిశీలించి విడుదల చేస్తారని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, సర్వైలెన్స్ టీమ్స్, చెక్ పోస్టుల్లో పోలీసులు సీజ్ చేసిన నగదు, వస్తువులకు సంబంధించి జెడ్పీ సీఈఓ ఆధ్వర్యంలోని గ్రీవెన్స్ కమిటీని సంప్రదించాలని సూచించారు. జిల్లాకు ఎన్నికల పరిశీలకులను నియమించామని, నేరుగా కలిసి ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని చెప్పారు. పోటీచేసే అభ్యర్థుల తుది జాబితాను 29వ తేదీ సాయంత్రం గుర్తులతో సహా ప్రకటించడం జరుగుతుందని వివరించారు. నామినేషన్ల స్క్రూటినీకి అభ్యర్థి, అతని ఎన్నికల ఏజెంటు, ప్రపోజర్‌తో పాటు మరొకరు, మొత్తం నలుగురిని మాత్రమే అనుమతిస్తామని చెప్పారు.

జీసీసీ లక్ష్యాలను అధిగమించాలి


మాట్లాడుతున్న జీసీసీ డీఎం మహేంద్రకుమార్

సాలూరు: నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జీసీసీ డీఎం మహేంద్రకుమార్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని జీసీసీ బ్రాంచ్‌లో సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ, రామభద్రపురం మండలాల సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది రూ.56 కోట్లు లక్ష్యం కాగా, దాన్ని అధిగమించి రూ.60 కోట్లు ప్రగతి సాధించామన్నారు. ఈ ఏడాది రూ.60 కోట్లు లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. దీనికి అనుగుణంగా సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, నిబద్ధతతో పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. జీసీసీ సేవలు గిరిజనులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

అనంతరం ఆయన ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేశారు. ఈ నెల 30లోగా పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు బీఎం రామారావు, సేల్స్‌మెన్‌లు, డీలర్లు, సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు.